నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939



సంపుటి :12 సంచిక :323 రంగారెడ్డి | బుధవారం 18 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00
Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada


# మొండి బకాయిల రైటాఫ్

## 11 ఏళ్లలో ₹9.75 లక్షల కోట్లు

- రుణాల రద్దుపై కేంద్రం కీలక ప్రకటన
- ఆర్బీఐ, బ్యాంకుల బోర్డుల ఆమోదం మేరకు చర్యలు
- రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లించాల్సిందే
- లోక్‌సభలో ఆర్థికశాఖ సహాయ మంత్రి వెల్లడి



న్యూఢిల్లీ,మార్చి 17 నిర్భయవార్త : గడిచిన 11 ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోని బ్యాంకులు ఏకంగా ₹9.75 లక్షల కోట్ల విలువైన రుణాలను రైటాఫ్ (రద్దు) చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ రైటాఫ్‌ల ప్రక్రియ ఆర్బీఐ మార్గదర్శకాలు, బ్యాంకుల బోర్డులు ఆమోదించిన పాలసీల మేరకే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. "బ్యాంకులు మొండి బకాయిలను (NPA) రైటాఫ్ చేస్తాయి. ముఖ్యంగా నాలుగేళ్ల తర్వాత పూర్తి ప్రొవిజనింగ్ చేసిన ఖాతాలను ఈ జాబితాలో చేర్చుతారు. అయితే, రైటాఫ్ చేయడం అంటే రుణగ్రహీతల బాధ్యతలను రద్దు చేయడం కాదు. దీనివల్ల రుణగ్రహీతలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు. రుణాలు తీసుకున్న వారు వాటిని తిరిగి చెల్లించాల్సిందేనని, రద్దు చేసిన ఖాతాల నుంచి కూడా బకాయిల వసూలు ప్రక్రియను బ్యాంకులు కొనసాగిస్తాయని చౌదరి తెలిపారు. వివిధ రికవరీ పద్ధతుల ద్వారా ఈ వసూళ్లను కొనసాగిస్తారని పేర్కొన్నారు.




### ఏడాది వారీగా గణాంకాలివే..

ఏడాది వారీగా గణాంకాలను పరిశీలిస్తే.. 201920 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా ₹1.59 లక్షల కోట్ల రుణాలు రైటాఫ్ అయ్యాయని మంత్రి తెలిపారు. అప్పటి నుంచి ఈ మొత్తం తగ్గుతూ వచ్చిందని, 202425లో ₹47,568 కోట్లకు చేరిందని వెల్లడించారు. 201415లో ₹31,723 కోట్లు, 201516లో ₹40,416 కోట్లు, 201617లో ₹68,308 కోట్లు, 201718లో ₹99,132 కోట్లు రైటాఫ్ చేసినట్లు వెల్లడించారు.

### క్యాష్‌ఫ్రీపై ఆర్బీఐ జరిమానా..

మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను పాటించనందుకు పేమెంట్ అగ్రిగేటర్ సంస్థ 'క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌పై ₹3.1 లక్షల జరిమానా విధించింది. ఎస్క్రో ఖాతా నుంచి కొన్ని "అనుమతి లేని డెబిట్‌లు" చేసినట్లు ఆర్బీఐ గుర్తించింది. ఈ నెల 9న జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ పెనాల్టీ విధించినట్లు ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. 2024 ఏప్రిల్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో కంపెనీ కార్యకలాపాలపై జరిపిన తనిఖీల్లో ఈ ఉల్లంఘనలు బయటపడినట్లు పీటీఐ తెలిపింది. మొదట క్యాష్‌ఫ్రీకి నోటీసులు ఇచ్చి, ఆ తర్వాత ఆరోపణలు రుజువు కావడంతో జరిమానా విధించినట్లు ఆర్బీఐ వివరించింది. ఈ చర్య కేవలం నియంత్రణపరమైన లోపాలపైనేనని, కంపెనీకి, కస్టమర్లకు మధ్య జరిగిన లావాదేవీల చెల్లుబాటును ప్రశ్నించే ఉద్దేశం లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది.

## వచ్చే ఏడాది నాటికి ఓఆర్ఆర్ పరిధిలో

# 2,800 ఎలక్ట్రిక్ బస్సులు

- గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించాం
- విద్యుత్ వాహనాలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీల 100 శాతం రద్దు
- సెకండ్ నేషనల్ మొబిలిటీ 2026 సమ్మిట్‌లో మంత్రి పొన్నం




హైదరాబాద్, మార్చి 17 నిర్భయవార్త ప్రతినిది

వచ్చే ఏడాదిలోగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ ప్రాంతంలో 2 వేల 800 ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజా రవాణాలో గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించామని తెలిపారు. నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించిన సెకండ్ నేషనల్ మొబిలిటీ 2026 సమ్మిట్ ను ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా పొన్నం మాట్లాడుతూ.. ఆర్థిక వృద్ధికి, సామాజిక అభివృద్ధికి సమర్థవంతమైన రవాణా వ్యవస్థలే కీలకమని పేర్కొన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో సురక్షితమైన, సరసమైన రవాణా వ్యవస్థలను నిర్మించడమే మా లక్ష్యం. ముఖ్యంగా బస్సు సేవలు, మెట్రో కనెక్టివిటీ మరియు లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడం ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ఉత్పాదకతను పెంచుతాం అని మంత్రి వివరించారు. 2026 చివరి వరకు కొనుగోలు చేసే విద్యుత్ వాహనాలకు ఎటువంటి పరిమితి లేకుండా 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. 810 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్నాయన్నారు. ఈ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్లాట్‌ఫారమ్‌లు ఆవిష్కరణ ,అమలును వేగవంతం చేసే భాగస్వామ్యాలను సృష్టించడంలో సహాయపడతాయి. తెలంగాణ ఆవిష్కరణ, క్లీన్ మొబిలిటీ , స్థిరమైన రవాణా వ్యవస్థలకు మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉంది. ఈ సమ్మిట్ గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విజన్ 2047లో ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందన్నారు.

# బీఆర్ఎస్ అందుకే రాజ్యసభ అభ్యర్థిని పెట్టలేదు: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 17 నిర్భయవార్త ప్రతినిది : ప్రస్తుత రాజకీయ పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు చిట్‌చాట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నందున దాన్ని బలహీనపరచడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. జీవన్ రెడ్డి విషయంపై స్పందిస్తూ.. ఆయన ఎలాంటి పదవులు కోరుకోలేదని, స్థానిక సమస్యలే ఉన్నాయని తెలిపారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

### బాధ్యతగా శాసనసభకు హాజరవ్వాలి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనుభవజ్ఞుడని, బాధ్యతగా శాసనసభకు హాజరవ్వాలని శ్రీధర్ బాబు సూచించారు. నామినేటెడ్ పదవుల విషయంలో హైకమాండ్ కసరత్తు చేస్తోందని, పోర్ట్‌ఫోలియో కేటాయింపులు ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. భవిష్యత్తులో సీఎం ఎవరనే అంశాన్ని ఏఐసీసీ నిర్ణయిస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 15 వేల కోట్ల బకాయిలను గత ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. అయితే.. వాటిని ప్రస్తుత ప్రభుత్వం చేసిన బకాయిలుగా చూపుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ ఫ్లోర్ కమిటీలు త్వరలోనే భర్తీ అవుతాయని తెలిపారు.

### నమ్మకం లేకనే అభ్యర్థిని పెట్టలేదు..

అనిరుధ్ రెడ్డి ప్రతిపాదించిన ఇప్పపువ్వు సారా అంశంపై స్పందిస్తూ.. అది మంచి ఆలోచనగా అభివర్ణించారు శ్రీధర్ బాబు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో పనిచేస్తూ సిక్సర్లు కొడుతుంటే, బీఆర్ఎస్ సోషల్ మీడియాలో మాత్రమే ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ అసెంబ్లీ బయటే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఎవరూ ఏ వర్గాన్ని అవమానించేలా మాట్లాడకూడదని సూచిస్తూ.. ఇప్పటికే మందుల సామేలు వివరణ ఇచ్చారని, అవసరమైతే మళ్లీ వివరణ ఇస్తారని చెప్పారు. బీఆర్ఎస్ తమ ఎమ్మెల్యేలపై నమ్మకం లేకనే రాజ్యసభ అభ్యర్థిని నియమించలేదని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు.


# మోయినాబాద్ డ్రగ్స్ కేసులో 9 మంది అధికారులతో సిట్ ఏర్పాటు..!



హైదరాబాద్, మార్చి 17 నిర్భయవార్త ప్రతినిది : రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన మోయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. రిమాండ్‌లో ఉన్న నిందితులను విచారించడం, డ్రగ్స్ పార్టీపై లోతుగా విచారణను జరపడం కోసం తొమ్మిది మంది అధికారులకు బాధ్యతలు అప్పగించింది. సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేయనుంది.సిట్ చీఫ్‌గా చీఫ్‌గా చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా గ్రేహౌండ్స్ కమాండర్ రవీందర్ రెడ్డి, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఈగల్ డీఎస్పీలు బుచ్చయ్య, హరీశ్ చంద్రారెడ్డి, మోయినాబాద్ ఎస్‌హెచ్‌వో మల్లిఖార్జున, ఎస్‌ఐలు కోటేశ్వర్ రావు, వెంకన్న, సదత్ అలీలు ఎంపికయ్యారు.పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుఉన్నాయని సిట్ ఆరోపించింది. వెంటనే రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారులకు సిట్ లేఖ రాసింది. ప్రధాన నిందితులు పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేశ్ రెడ్డి, నమిత్ శర్మలను ఏడు రోజులకు కస్టడీ కోరింది.అలానే రితేశ్ రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు సిట్ లేఖ రాసింది.

# టీఎంసీ అభ్యర్థుల జాబితా విడుదల..

## మరోసారి ఒకే స్థానం నుంచి మమత, సువేందు పోటీ



కలకత్తా, మార్చి 17 నిర్భయవార్త : పశ్చిమ బెంగాల్‌లో ఈసారి కూడా అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా సాగబోతున్నాయి. అధికార పార్టీ అధ్యక్షురాలు, సీఎం మమతా బెనర్జీ, ప్రతిపక్ష నేత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి మరోసారి ఒకే స్థానం నుంచి పోటీ చేయబోతున్నారు. ఇద్దరూ దక్షిణ కోల్‌కతాలోని బబానిపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ప్రస్తుతం మమత, బబానిపూర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇద్దరూ 2021లో జరిగిన ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి పోటీపడగా.. సువేందు ఎమ్మెల్యేగా గెలుపొందారు.మమతా బెనర్జీ 2,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. దీంతో ఈసారి కూడా ఇద్దరూ ఒకేస్థానం నుంచి పోటీ పడబోతుండటం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ప్రకటనపై దృష్టి పెట్టాయి. అధికార టీఎంసీ మంగళవారం 294 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించింది. పార్టీ అధ్యక్షురాలు మమత, టీఎంసీ జనరల్ సెక్రెటరీ, లోక్‌సభ ఎంపీ అభిషేక్ బెనర్జీ కలిసి కోల్‌కతాలో మంగళవారం సాయంత్రం అభ్యర్థుల్ని ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో 294 సీట్లున్నాయి. దీంతో మొత్తం స్థానాలకు టీఎంసీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఇందులో 52 మంది మహిళలున్నారు. 95 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులున్నారు. బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో, రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. ఈ సీజన్‌లో జరగనున్న ఎన్నికల్లో చివరి దశ ఎలక్షన్ బెంగాల్‌లోనే. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు. ఈసారి ఎలాగైనా బెంగాల్‌లో అధికారం దక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుంటే.. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టాలని టీఎంసీ పట్టుదలతో ఉంది.

నిర్భయవార్త

సంపాదకీయం

బుధవారం 18, మార్చి 2026

## బడబాగ్నిలో బతుకు'బండ'లు!

భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించిన అయిదు సంవత్సరాలకు రెండు ఆధునిక ఉపకరణాలు భారతీయ గృహజీవనంలోకి ప్రవేశించాయి. అవి, ఒకటి ప్రెషర్ కుక్కర్, మరొకటి ఎల్పీజీ సిలిండర్. వీటి మూలాలు విదేశాలలో ఉన్నప్పటికీ, ఆధునిక భారతీయ కుటుంబంలో ఒక అనివార్యమైన భాగంగా, ఒక ఆకాంక్షాత్మక జీవన శైలికి ఆలంబనగా ఉన్నాయి. వంటగదిలో ఒకటి లేదా రెండు ప్రెషర్ కుక్కర్‌లు, ఎల్పీజీ సిలిండర్లు ఉండడమనేది నేటి భారతీయ కుటుంబ ప్రతిష్ఠ, శ్రేయస్సు, సామాజిక ఆకాంక్షలకు ఒక తార్కాణం. గత శతాబ్ది సినిమాలలో హీరో లేదా హీరోయిన్ కుటుంబ పేదరికాన్ని సూచించేందుకు కట్టెల పొయ్యిపై వంట చేస్తూ, చుట్టుముట్టిన పొగతో ఊపిరాడక సతమతమవుతున్న ఒక మహిళను చూపించడం సర్వసాధారణంగా ఉండేది. ఎల్పీజీ సిలిండర్‌కు ఉన్న రాజకీయ ప్రాధాన్యమూ తక్కువేమీ కాదు. గ్రామీణ ప్రాంతాల పేద కుటుంబాలకు పరిశుభ్రమైన వంట ఇంధనాన్ని సమకూర్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై-- దీనిని 2016లో ప్రవేశపెట్టారు) ఆ రాజకీయ ప్రాధాన్యానికి అద్దం పడుతుంది. ప్రధానమంత్రి నుంచి అమితానందంతో, ఎనలేని కృతజ్ఞతా భావంతో ఎల్పీజీ సిలిండర్లు అందుకుంటున్న గ్రామీణ మహిళలను చూపిస్తున్న వాణిజ్య ప్రకటనలు బీజేపీ ప్రచార వ్యూహాలలో అగ్రస్థానంలో ఉండటం రెడ్ సిలిండర్ల రాజకీయ ప్రాధాన్యాన్ని మరింతగా విశదం చేస్తోంది. అయితే సగటు భారతీయ కుటుంబ శ్రేయస్సుకు దోహదం చేస్తోన్న ఎల్పీజీ సిలిండర్ల సరఫరా ఇప్పుడు ప్రపంచ భౌగోళిక రాజకీయాల సుడిలో చిక్కుకుంది. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్‌ల యుద్ధం, పర్యవసానంగా హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఇరాన్ ఆంక్షలు విధించడంతో, లక్షలాది సామాన్య కుటుంబాల వంటశాలలకూ ఆ యుద్ధతాకిడి చేరింది. భారత్‌కు దిగుమతి అయ్యే ఎల్పీజీలో అత్యధిక భాగం హోర్ముజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతుంది. ఇరాన్ పాలకులు భారత్ దిగుమతులకు ప్రత్యేక అనుమతినిచ్చినప్పటికీ సమస్య తీవ్రత సత్వరం తగ్గిపోయేది కాదు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల అమెరికా, యూరోపియన్ దేశాలలో పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల, వినియోగదారుల ఆగ్రహావేశాలకు ప్రపంచ మీడియా తీవ్ర ప్రాధాన్యం ఇస్తోంది. కానీ, అభివృద్ధి చెందుతున్న దేశాలపై, మరీ ముఖ్యంగా ఆ దేశాలలోని పేదల బతుకుదెరువుల పైన పడుతున్న యుద్ధ విషమ ప్రభావాల గురించి పట్టించుకోకపోవడం పూర్తిగా గర్హనీయం. ఘన ఇంధనాలను-- వంటచెరకు వాటికొక ఉదాహరణ-- మండించడం వాయు కాలుష్యానికి దారితీస్తుంది, దీని ప్రభావం ప్రజల, ముఖ్యంగా పేదల ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటుంది. వంట కార్యకలాపాలలో ఉపయోగించే ఘన ఇంధనాల ప్రభావానికి సంబంధించి నాలుగు పరస్పర ప్రభావమున్న అంశాలు ఉన్నాయి. అవి: వర్గం, కులం, జెండర్, గ్రామీణ-- పట్టణ అంతరాలు. ఈ ఇంధనాల ఉపయోగం పేదల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఆర్థిక స్థితిగతులు కాస్త మెరుగ్గా ఉన్న కుటుంబాలపై కూడా దీని ప్రభావం ఉన్నా, పేదలపై ఉన్నంతగా ఉండదు. ఇందుకొక కారణం జనాభా సాంద్రత. గృహ సముదాయాలు కిక్కిరిసి ఉన్న ప్రాతాలలో పేదలు నివసిస్తుంటారు. వారు ఉండే గృహాలు ఇరుకుగా ఉంటాయి. పొయ్యి నుంచి లేచే పొగ ఇల్లంతా వ్యాపించడం పరిపాటి. నిర్దిష్ట గృహంలోనివారే కాకుండా ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఇతరులు కూడా ఆ కాలుష్యం బారిన పడతారు. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ తదితర పరిశుభ్ర ఇంధనాలు అందుబాటులో ఉండడమనేది కులంపై ఆధారపడి ఉన్నదని కూడా ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండిటిలోనూ ఎల్పీజీని ప్రధాన వంటగ్యాస్‌గా ఉపయోగించుకుంటున్న అగ్రకులాల కుటుంబాల శాతం, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తరగతులకు చెందిన కుటుంబాల శాతం కంటే మూడు లేదా నాలుగు రెట్లు అధికంగా ఉన్నది. ఆయా వర్గాల నివాసస్థలాలు కూడా ఆ వ్యత్యాసానికి కారణమవుతు న్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సామాజికంగా అట్టడుగువర్గాల వారు సాధారణంగా ఊరికి దూరంగా నివాసముంటారు. ఆ ప్రదేశాలకు రవాణా సదుపాయాలు అంతగా ఉండవు. ఎల్పీజీ సిలిండర్లకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా, వాటి రవాణాకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కారణంగా పట్టణ ప్రాంతాలలోని పేదల కంటే గ్రామీణ ప్రాంతాల పేదలు ఆధునిక ఇంధనాలపై కాకుండా సంప్రదాయ ఇంధనాలపైనే ఆధారపడడం తప్పనిసరి అవుతోంది. వంటగ్యాస్‌ను నిరుపేదలకూ అందుబాటులోకి తీసుకురావడంలో సరైన గుర్తింపు పొందలేకపోతున్న సంక్లిష్ట సమస్య ఇది. సంప్రదాయక ఇంధనాల (వంట చెరకు, పిడకలు, పంట అవశేషాలు మొదలైనవి)తో వంట చేసుకునే కుటుంబాలలో పొగ కాలుష్యానికి బాధితులు అవుతున్నది మహిళలు, బాలికలే. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల కుటుంబాలలో ఒకే విధంగా ఉంటోంది. ఆహారాన్ని తయారు చేసే బాధ్యత పూర్తిగా మహిళలది కావడమే ఇందుకు కారణం. కాగా వంటకు ఏ విధమైన ఇంధనాలను ఉపయోగించాలనే నిర్ణయం తీసుకోవడం సాధారణంగా పురుషుల బాధ్యతగా ఉంటోంది. మన సమాజంలో సర్వ సాధారణంగా ఉన్న జెండర్ అసమానతల దృష్ట్యా కుటుంబ బడ్జెట్‌లో మహిళా ఆరోగ్యానికి కేటాయింపులకు సరైన ప్రాధాన్యం లభించడం అరుదు. కుమార్తెలు బాల్యం నుంచే ఇంటి పనులు, ముఖ్యంగా వంట పనుల్లో తల్లికి సహాయపడుతుంటారు. ఈ కారణంగా వారు చిన్న వయసు నుంచే వంటగదిలో పొగ కాలుష్యానికి గురవుతారు. వారిలో చాలామంది జీవితాలు ఆ తరువాత కూడా అటువంటి పరిస్థితులలోనే కొనసాగుతాయి. ఇలా అనారోగ్యం పాలయ్యే అవకాశాలను తగ్గించడంతో పాటు వంటగ్యాస్ సౌలభ్యం మహిళలకు మరో శ్రేయోదాయక ప్రయోజనాన్ని కూడా సమకూరుస్తోంది. ఎల్పీజీ అందుబాటులో ఉండడం వల్ల వంటచెరకును సేకరించుకోవల్సిన ప్రయాస లేకుండా పోవడంతో పాటు వంట త్వరితగతిన పూర్తవుతుంది, ఫలితంగా మహిళలకు గణనీయమైన సమయం ఆదా అవుతుంది. దీనివల్ల గృహ సంబంధ బాధ్యతల నిర్వహణలో గొడ్డు చాకిరీ, చిరాకులు తప్పిపోయి గృహిణులకు ఖాళీ సమయం లభ్యమవుతోంది. ఈ తీరిక సమయాన్ని పఠనం, టీవీ వీక్షణం మొదలైన ఉల్లాసాలకు ఉపయోగించుకునే వెసులుబాటు వారికి కలుగుతోంది. ఉల్లాసంగా గడపడం ద్వారా తమ ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు కుటుంబ పోషణకు అదనపు ఆదాయాన్ని సమకూర్చేందుకు కూడా ఆ సమయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోగలుగుతున్నారు. తత్ఫలితంగా తమకొక ఆర్థిక స్వయం ప్రతిపత్తిని సాధించుకోగలుగుతున్నారు. దమ్మిడీ జీతం, భత్యం లేకుండా అరక్షణం తీరిక లేకుండా పొద్దస్తమానం పనిచేస్తున్నా దొరకని ఆర్థిక స్వాతంత్ర్యం వంటగ్యాస్ సదుపాయంతో సమకూరుతున్న సమయ వెసులుబాటుతో లభిస్తుంది.

# ధరలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సామ్రాజ్యవాదం

మొత్తానికి ఈ వారంలో ముడి చమురు అంతర్జాతీయ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల హద్దు దాటేసింది. 110 డాలర్లకు చేరింది కూడా. ఇరాన్ మీద సామ్రాజ్యవాదుల దాడి ప్రారంభం అవడానికి ముందు వరకూ ముడి చమురు ధర బ్యారెల్‌కు 69 డాలర్లుగా ఉండేది. అందుచేత కేవలం ఒక్క వారంలో అమాంతం ఇంతలా




పెరిగిపోవడం చాలా తీవ్రమైన విషయం. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వలన వాస్తవంగా ఏర్పడిన చమురు సరఫరా కొరత వలన పెరిగిన ధర కన్నా, చమురు కొరత ఏర్పడబోతోందన్న ముందస్తు అంచనాల వలన పెరిగిన ధర ఎక్కువ. 1973 నాటి పెరుగుదలకు ఇది పూర్తిగా భిన్నం. అప్పుడు ధర పెరుగుదలకు చమురు కొరత కారణం కాదు. చమురు ఉత్పత్తి దేశాలు ముడి చమురు ధరను పలు రెట్లు పెంచివేయడం కారణం. 2008లో, 2022లో కూడా చమురు ధరలు పెరిగాయి. కాని వాటికన్నా కూడా ప్రస్తుత పెరుగుదల విభిన్నమైనది. 2008లో గాని, 2022లో గాని చమురు ధరలు పెరగడం స్వల్పకాలిక స్వభావం కలిగినవి. 2008లో చైనా నుండి చమురుకు డిమాండ్ పెరిగింది. నైజీరియా నుండి, పశ్చిమాసియా నుండి చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. ఈ రెండు కారణాలూ స్వల్పకాలికమైనవే. అందుకే ఆ పెరుగుదల నిలవలేదు. అదేవిధంగా 2022లో కూడా జరిగింది. అప్పుడు ఉక్రెయిన్ యుద్ధం సాకుతో రష్యాపై అమెరికా ఆంక్షలు విధించింది. కాని రష్యా ఆ ఆంక్షలను బేఖాతర్ చేసి తన చమురు సరఫరాలో ఎక్కువ భాగాన్ని కొనసాగించింది. దానికి తోడు అమెరికా నుండి కూడా ముడి చమురు యూరపు దేశాలకు సరఫరా అయింది. అయితే దాని ధర ఎక్కువ. ఏమైనా, ఆ పెరుగుదల కూడా ఎక్కువ కాలం కొనసాగలేదు. ఇప్పుడు ధర పెరగడానికి కారణం అమెరికా-ఇజ్రాయిల్ తన మీద సాగిస్తున్న దాడికి ఇరాన్ నుంచి వచ్చిన ప్రతిస్పందన. ఈ యుద్ధం కొనసాగినంత కాలమూ పెరిగిన చమురు ధర కూడా అలానే కొనసాగుతుంది. ఈ యుద్ధం ముగిసేది ఎప్పుడో కనుచూపు మేరలో కానరావడం లేదు. హార్ముజ్ జలసంధి ద్వారా ఒక్క ఇరాన్ సరఫరాలే కాదు, అనేక దేశాల నుండి సరఫరాలు రవాణా అవుతాయి. వాటన్నింటి మొత్తం కలిపితే రష్యా నుండి సరఫరా అయ్యే ముడి చమురు కన్నా రెట్టింపు ఉంటుంది. ఇటువంటి సమయంలో చమురు ధరల విషయంలో స్పెక్యులేషన్‌ను చల్లార్చేబదులు, డొనాల్డ్ ట్రంప్ ఆ సమస్యను కొట్టిపారేశాడు. యుద్ధం ద్వారా సాధించవలసిన లక్ష్యాలతో పోల్చినప్పుడు ''ఈ పాటి చిన్న మూల్యం'' చెల్లించక తప్పదు అన్నాడు. ముడి చమురు ధరల పెరుగుదల ఇదే విధంగా కొంతకాలం పాటు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద దాని ప్రభావం చాలా ప్రగాఢంగా పడుతుంది. చమురు ఉత్పత్తుల కొనుగోలు చేసే వినియోగదారుల మీద ప్రత్యక్షంగా భారం పడి ద్రవ్యోల్బణానికి దారి తీయడం జరుగుతుంది. దానికన్నా ముఖ్యంగా చమురు ఇంధనాన్ని ఉపయోగించి చేసే అనేక ఉత్పత్తుల, సేవల ధరలు కూడా పెరుగుతాయి. ఎరువుల ధరలు పెరుగుతాయి. వాటిని ఉపయోగించేది వ్యవసాయంలో. అందుచేత ఆహారధాన్యాల ధరలు పెరుగుతాయి (రైతులకు లభించే ధరలు తగ్గిపోకుండా ఉంటే). ఇవిగాక, అన్ని సరుకుల రవాణా చార్జీలు పెరుగుతాయి. దాంతో ద్రవ్యోల్బణానికి గట్టి ఊపు వస్తుంది. అమాంతం వచ్చిపడిన అదనపు లాభాల వలన ప్రయోజనం పొందినవారు వాటిని బ్యాంకుల్లో భద్రంగా దాచుకుంటారు. అందువలన వారి అదనపు ఆదాయం నుండి మార్కెట్ లోకి అదనపు డిమాండ్ రూపంలో వచ్చేది ఏమీ ఉండదు. కాని ధరలు పెరిగినందువలన తక్కినవారు తమ డిమాండ్‌ను కుదించుకోవలసి వస్తుంది. అందువలన ప్రపంచం మొత్తం మీద డిమాండ్ కుదించుకుపోతుంది. దాని వలన ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం పెరుగుతుంది. ఒకవేళ చమురు ఉత్పత్తిదారులు కావాలనే ఈ ధర పెరుగుదల తెచ్చిపెట్టారనుకోండి (1970 దశకంలో మాదిరిగా). అప్పుడు ఆ ధరల పెరుగుదల వలన నష్టపోతున్న దేశాల ప్రభుత్వాలు తమ దేశాల్లో ఆర్థిక మాంద్యం పెరిగిపోకుండా నివారించడానికి తమ తమ స్థూల డిమాండ్‌ను పడిపోకుండా నిలబెట్టవచ్చు. అందుకు అవసరమైన ద్రవ్య విధానాన్ని, నగదు సరఫరా విధానాన్ని చేపట్టవచ్చు (అయితే 1970 దశకంలో ప్రభుత్వాలు ఏవీ ఇలా చేయలేదనుకోండి). కాని చమురు సరఫరాకే కొరత ఏర్పడి దాని వలన ముడి చమురు ధర పెరిగినప్పుడు నెలకొనే ఆర్థిక మాంద్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టడం సాధ్యం కాదు. వాస్తవానికి చమురు సరఫరాలో కొరత ఏర్పడినప్పుడు దానిని అధిగమించడానికి ఆర్థిక మాంద్యమే పరిష్కారం అవుతుంది. అందుచేత ఇప్పుడు ముడిచమురు ధర పెరిగినందువలన ద్రవ్యోల్బణంతో కూడిన ఆర్థిక మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనివార్యంగా తలెత్తుతుంది. ఈ ఆర్థిక మాంద్యం చమురు ఉత్పత్తి దేశాలతో సహా అన్నింటిలోనూ తలెత్తుతుంది (అయితే చమురు ఉత్పత్తి దేశాలు దీని ప్రభావాన్ని తగ్గించేవిధంగా తమ తమ దేశాల్లో చర్యలు చేపట్టగలుగుతారు). ఇక మూడవ ప్రపంచ దేశాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. దానికి అదనపు కారణాలు తోడవుతాయి. చమురు ధరలు పెరిగినందువలన దానిని దిగుమతి చేసుకునే దేశాల విదేశీ మారక చెల్లింపు ఖాతాలు కరిగిపోయి లోటు పెరుగుతుంది. అదే చమురు దిగుమతి చేసుకునే సంపన్న దేశాల విషయంలోనైతే, వాటికి బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి తయారుగా ఉంటాయి. ఆ బ్యాంకుల దగ్గర చమురు ఎగుమతి చేసే దేశాల నుండి వచ్చిన అదనపు ధనం చేరుతుంది. దానినుండి చమురు దిగుమతి చేసుకునే సంపన్న దేశాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వగలుగుతాయి. కాని మూడవ ప్రపంచ దేశాలకు ఆ విధంగా రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావు. రుణాలు పొందగలిగిన స్థోమత మూడవ ప్రపంచ దేశాలకు లేదని బ్యాంకులు, ఇతర అంతర్జాతీయ రుణ దాతలు భావించడమే ఇందుకు కారణం.

ఇప్పుడు పెరిగిన విదేశీ చెల్లింపుల లోటును పూడ్చుకోడానికి మూడవ ప్రపంచ దేశాలు మరింత క్లిష్టమైన షరతులకు లోబడి విదేశీ రుణాలు పొందడానికి పూనుకోవలసి వస్తుంది. అప్పుడు వారి కరెన్సీల విలువలు పడిపోవడమే కాక, షరతుల్లో భాగంగా మరింత కఠినమైన ''పొదుపు చర్యలను'' అమలు చేయడానికి ఈ దేశాలు తలొగ్గవలసి వస్తుంది. లేదా తమ దేశాల్లోని విలువైన ఖనిజ సంపదను తాకట్టు పెట్టడమో లేక అమ్ముకోవడమో చేయాల్సి వస్తుంది. ఎప్పుడైతే కరెన్సీ విలువ పడిపోతుందో అప్పుడు ద్రవ్యోల్బణం మరింత విజృంభిస్తుంది. ఎందుకంటే కరెన్సీ విలువ పడిపోవడం వలన ముడిచమురు దిగుమతులు మరింత ఖరీదౌతాయి. దానితోబాటు ఈ దేశాల్లో మాంద్యం మరింత ఎక్కువ తీవ్రతను కనపరుస్తుంది. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజల కొనుగోలుశక్తి పడిపోయి సరుకుల, సేవల వినియోగం తగ్గిపోయి అది మాంద్యానికి దారి తీయడం ఒక్కటే కారణం కాదు. విదేశీ రుణదాతలు "పొదుపు చర్యల" పేరుతో విధించే షరతుల కారణంగా ప్రజల వినిమయశక్తి మరింత పడిపోతుంది. మరింతగా మాంద్యం నెలకొంటుంది. దాని వలన ప్రజల ఇబ్బందులు మరింత పెరుగుతాయి. అమెరికా చట్టవిరుద్ధంగా ప్రారంభించిన ఈ అనైతిక యుద్ధాన్ని వెంటనే నిలుపు చేయాలని డిమాండ్ చేయడం, అమెరికాపై ఒత్తిడి పెంచడం ఈ మూడవ ప్రపంచ దేశాలకు మరింత ఎక్కువ అవసరం. ప్రపంచ చమురు ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే ఇండియా చాలా తీవ్రంగా దెబ్బ తింటుంది. హార్ముజ్ జల సంధి ద్వారా రవాణా అయ్యే చమురులో 84 శాతం చైనా, ఇండియా, జపాన్, దక్షిణ కొరియా దేశాలే కొనుగోలు చేస్తాయి. అందుచేత ఈ హార్ముజ్ జలసంధిని మూసివేయడం వలన ప్రపంచవ్యాప్త చమురు ధరలు పెరగడమేకాక, ప్రత్యేకించి ఈ దేశాల మీద ప్రత్యక్ష, తక్షణ ప్రభావం పడుతుంది. సకాలంలో, భౌతికంగా చమురు సరఫరాలు ఈ దేశాలకు అందకుండా పోతాయి. వాటిలో ఇండియా ఒక ముఖ్యమైన దేశం. అయితే కొద్దికాలం వరకూ రష్యా నుండి చమరు దిగుమతి చేసుకోడానికి డొనాల్డ్ ట్రంప్ మన దేశానికి 'అనుమతి' ఇచ్చాడనుకోండి. దాని వలన పెరిగిన చమురు ధరల ప్రభావం కొద్దికాలం వరకూ పడకపోవచ్చు (ఇలా మన దేశానికి కావలసినవి దిగుమతి చేసుకోడానికి వేరే మూడవ దేశం 'అనుమతి' ఇవ్వడం అనేది ఎనిమిది దశాబ్దాల మన స్వాతంత్ర్యానికి, దానిని సాధించిన జాతీయోద్యమానికి అత్యంత అవమానకరం. అలా అనుమతిచ్చే అధికారాన్ని సవాలు చేసి తిరస్కరించేబదులు, ఆ 'అనుమతిని' నిస్సిగ్గుగా ఆమోదించడం మరింత అవమానకరం.). అయితే ఈ 'అనుమతి' కేవలం ఒక నెల రోజులవరకే ఇచ్చాడు. ఆ తర్వాత మళ్ళీ మన పరిస్థితి మొదటికే వస్తుంది. ఇటువంటి పరిస్థితిలో అమెరికా-ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణ దాడిని ఖండిచి నిరసన తెలిపే బదులు మౌనం వహించడం భారత దేశానికి ఆత్మహత్యా సదృశం అవుతుంది. వాస్తవానికి హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడానికి కారణం అమెరికా దాడి పట్ల మూడవ ప్రపంచ దేశాలలో వ్యతిరేకతను పెంచాలనుకోవడమే. ఇరాన్‌పై యుద్ధం అంటే మూడవ ప్రపంచ దేశాలన్నింటిపైనా యుద్ధమే అని వాటిని ఒప్పించడం కోసమే. ఇరాన్ సైనికాధికారులు ప్రపంచ చమురు ధరలు రానున్న రోజుల్లో ఏకంగా బ్యారెల్‌కు 200 డాలర్ల వరకూ పెరగవచ్చునని అంచనాలు వేస్తున్నారు. అదే గనుక జరిగితే, ఇక మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద నడ్డి విరిగే భారాలు పడక తప్పదు! దానిని నివారించాలంటే ఈ దేశాలన్నీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, యుద్ధానికి వ్యతిరేకంగా గట్టిగా నిలవక తప్పదు. మూడవ ప్రపంచ దేశాల మౌనం కొనసాగితే అవి మరొకందుకు కూడా భారీ మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన ఈ యుద్ధం కారణంగా అమెరికాలో ద్రవ్యోల్బణం, దానితోబాటు మాంద్యం పెరుగుతున్నాయి. ప్రజానీకపు ఆగ్రహాన్ని అతడు చవిచూడవలసి వస్తుంది. ఇంతకు ముందే అతగాడు ప్రజల్లో సానుకూలతను కోల్పోయాడు లెండి. ఈ పరిస్థితుల్లో యుద్ధాన్ని తొందరగా ముగించడానికి ఇరాన్ మీద వ్యూహాత్మకంగా అణ్వాయుధాలను ప్రయోగించడానికి పూనుకున్నాడను కోండి. ఇప్పటివరకూ ప్రపంచంలో అణ్వాయుధాలను ప్రయోగించడానికి పూనుకున్న దేశం ఏదైనా ఉందీ అంటే అది అమెరికాయే. దాని వలన ఏర్పడిన వినాశనం వంటిది మళ్ళీ జరగకుండా అమెరికన్ ప్రభుత్వాన్ని ఇప్పటికి మూడు సందర్భాల్లో అంతర్గత సలహాదారులు తమ జోక్యంతో నిలవరించగలిగారు. మళ్ళీ ఈసారి నివారించడానికి మొత్తం ప్రపంచం యావత్తూ ఏకమై ముక్త కంఠంతో గొంతెత్తి, అంతర్జాతీయ చట్టాలకు పాతర వేస్తున్న అమెరికా తీరును ఖండించకపోతే ఈ మారు వినాశనాన్ని నివారించడం సాధ్యం కాకపోవచ్చు.

# సీఐని సన్మానించిన జనసేన నాయకులు



జవహర్ నగర్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు కొత్త సీఐగా ఎస్ సైదులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన నాయకులు రవి రాజ్ రాథోడ్, వై రమేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలుకుతూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు రాము నాయక్, ఇద్రిస్ అలీ లను కూడా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్ సైదులు మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. నేరాలను అదుపులో ఉంచేందుకు నూతన పోలీసింగ్ విధానాలకు శ్రీకారం చుట్టామని, చట్ట ప్రకారం కట్టుదిట్టంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాలను సమర్థంగా నియంత్రిస్తామని, ముఖ్యంగా యువత పెడదారిలో పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ సతీష్ నేత, జే పరుశురాం, ఎం చంద్రశేఖర్, నాగరాజు, జే నరసింహ, వి లక్ష్మణ్, ఎం జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# కెమికల్ ప్రమాదాలపై అప్రమత్తతకు మాక్ డ్రిల్ నిర్వహణ








మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కర్మాగారాలు, పరిశ్రమల్లో అకస్మాత్తుగా జరిగే కెమికల్ బ్లాస్ట్‌లు, గ్యాస్ లీకేజీలు, అలాగే బాంబు పేలుళ్ల వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలను సమర్థంగా అమలు చేయడం కోసం మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, కెమికల్ బ్లాస్ట్ సమయంలో విడుదలయ్యే వాయు కాలుష్య సాంద్రతను బట్టి తక్షణ చర్యలు ఎలా తీసుకోవాలి, పరిస్థితులను ఎలా అదుపులోకి తేవాలి అనే అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించే విధానాలు, రక్షణ చర్యలు ఎలా చేపట్టాలనే అంశాలను సవివరంగా వివరించారు.ప్రమాదాల సమయంలో ఫీల్డ్ ఆపరేషన్లలో వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రమాద ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది తమ ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక కిట్లు, మాస్కులు, రక్షణ దుస్తులు, గ్లౌజులు ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. బాధితులను రక్షించడంతో పాటు తమను తాము కాపాడుకునే విధానాలను కూడా ప్రదర్శించారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం అవగాహన కల్పించింది. మాక్ డ్రిల్‌లో భాగంగా ఉపయోగించిన క్లోరిన్ వంటి రసాయనాల లక్షణాలు, వాటి ప్రభావాలు, నియంత్రణ చర్యలపై కూడా దశలవారీగా వివరించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక, పరిశ్రమలు, వైద్య విభాగాల సమన్వయంతో ఈ మాక్ ఎక్సర్‌సైజ్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు డీసీపీలు వెంకట్ రెడ్డి, హనుమంతరావు, డిఆర్ఓ చంద్రావతి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహజ వ్యవసాయం వైపు రైతులు ముందుకు రావాలి..

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు..**



దుమ్ముగూడెం మార్చి 17 నిర్భయ వార్త ప్రతినిధి. దుమ్ముగూడెం మండలంలో పర్ణశాల రైతు వేదికలో మంగళవారం సహజ వ్యవసాయం పై ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు సహజ వ్యవసాయం పద్ధతులు, ప్రయోజనాలు, ఖర్చు తగ్గింపు, నేల ఆరోగ్యం పరిరక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న రైతులకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. రైతులు సహజ వ్యవసాయాన్ని స్వీకరించి స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు..

# గిరిజన మ్యూజియం వెనక భాగంలో 33/11 కె.వి సబ్ స్టేషన్ కు భూమి పూజ....





భద్రాచలం 17 మార్చి నిర్భయ వార్త ప్రతినిధి: భద్రాచలం ఐటిడిఏ పరిసరాల్లో నివసిస్తున్న కాలనీలోని కుటుంబాలకు సౌకర్యవంతంగా విద్యుత్ కొరత, సమస్యలు తలెత్తకుండా 33/11ఎఙ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వెనుక ఉన్న 30 కుంటల ఖాళీ స్థలంలో 33/11 కె.వి సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని శివారు కాలనీలలో లోవోల్టేజి మరియు విద్యుత్ సమస్య వలన పరికరాలు ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోతున్నట్లు ప్రజల విజ్ఞప్తుల మేరకు విద్యుత్ శాఖ ద్వారా మూడు కోట్ల రూపాయల వ్యయంతో సబ్ స్టేషన్ నిర్మాణం పనులకు ప్రారంభించడం జరిగిందని, ఈ సబ్ స్టేషన్ నిర్మాణం ఐదు నెలల్లో పూర్తవుతుందని, ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం వలన పట్టణం మరియు శివారు కాలనీలలో రాబోయే రోజులలో విద్యుత్ సమస్య అనేది ఉండదని, దాదాపు 5 వేల కుటుంబాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరిశీ డెంట్ ఇంజనీర్ ఈ మహేందర్, భద్రాచలం డివిజనల్ ఇంజనీర్ కే జీవన్ కుమార్, భద్రాచలం కన్స్ట్రక్షన్ డిఇ వెంకటేశ్వర్లు, ఇతర భద్రాచలం డివిజన్ మరియు జిల్లా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ వెంకటయ్య భద్రాచలంలో 18 నుండి 20 వరకు పర్యటన..



భద్రాచలం 17 మార్చ్ నిర్భయ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఈనెల 18 నుండి 20 వరకు మూడు రోజులపాటు భద్రాచలంలో పర్యటిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుంటారని అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియమును సందర్శించి ఐటీసీలో రాత్రి బస చేసి 19నాడు ఉదయం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానములో ప్రత్యేక పూజలు నిర్వహించి పాపికొండల సందర్శనకు బయలుదేరి వెళ్లి పాపికొండల సందర్శన అనంతరం తిరిగి రాత్రి ఐటిసిలో బస చేసి 20వ తారీకు నాడు ఉదయం హైదరాబాదుకు బయలుదేరి వెళ్తారని ఆయన అన్నారు

# షేక్ సర్దార్ జ్ఞాపకార్థంగా రిఫ్రిజిరేటర్ వితరణ.




సింగరేణి మార్చి 17 నిర్భయవార్త రిపోర్టర్. జామే మస్జిద్ కారేపల్లి కి దివంగత రైల్వే ఎంప్లాయ్ షేక్ సర్దార్ జ్ఞాపకార్థం సుమారు 60 వేల రూపాయల విలువగల ఏ.సి రిఫ్రిజిరేటర్ మస్జిద్ కొరకు వారి కుమారులు షేక్ సద్దాం,ఆజం కుటుంబ సభ్యులు వితరణ చేయడం జరిగింది . జామే మజీద్ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు సర్దార్ జ్ఞాపకార్థంగా వితరణ చేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామే మస్జిద్ అధ్యక్షులు షేక్ మునీరుద్దీన్ పటేల్, ఉపాధ్యక్షులు షేక్ షఫీ , షేక్అబ్దుల్ మతిన్, యాకుబ్ పాషా, షేక్ జహీర్,షేక్ జావీద్, మొహమ్మద్ రెహమాన్ ఫిరోజ్ (బూది) షేక్ రియాజ్, షేక్ జాఫర్,మహబూబ్ పాషా, షేక్ యాకుబ్,ఇస్మాయిల్ అతీక్ తదితరులు పాల్గొన్నారు

# సూచిక బోర్డులు లేక ఇబ్బంది పడుతున్న వాహనాదారులు

## ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసి కూడా చోద్యం చూస్తున్న అధికారులు..





దుమ్ముగూడెం మార్చి 17 నిర్భయవార్త ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుండి దుమ్ముగూడెం చర్ల వెంకటాపురం పేరూరు వాజేడు వరకు నేషనల్ హైవే ప్రధాన రహదారి పాము వంకర్లు తిరిగి డేంజర్ యాక్సిడెంట్ అయ్యే ప్రమాద మలుపులు. ముఖ్యంగా జాతీయ రహదారి కావడంతో వాహనాలు ఎక్కువై పెద్ద పెద్ద మూలమలుపులు ఉండడంతో వాహనదారులు, ప్రజలు నిత్యం పరేషాన్ అవుతున్నారు. మూల మలుపుల దగ్గర ఎలాంటి సూచిక బోర్డులు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, డేంజర్ జోన్లుగా మారిన రహదారి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులతో విన్నవించినా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు రోడ్లు అస్తవ్యస్తంగా గుంతలతో ఉండటంతో ప్రయాణికులు ముఖ్యంగా దక్షిణ మధ్య అయోధ్యగా పేరుగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రమైనటువంటి పర్ణశాలకు వచ్చే భక్తులు.. మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణించేవారు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు నేషనల్ హైవే కావడంతో భద్రాచలం నుండి వెంకటాపురం మార్గ మధ్యలో ఇసుక రాంపులు ఉండడంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు వడుతున్నారు. టిప్పర్లు లారీలు హెవీ వెహికల్స్ హెవీ లోడ్, ఇతర వాహనాలు ఇసుకను తరలిస్తూ, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ నేషనల్ రహదారుల మూలమలుపులో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీరామ నవమికి పనులు వేగవంతం చేయాలి...





భద్రాచలం 17 మార్చ్ నిర్భయ వార్త ప్రతినిధి. రెవెన్యూ, పోలీసు దేవస్థానం ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ఉండి విఐపి లకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా శ్రీరామనవమి ఏర్పాట్లు పూర్తి చేసి విజయవంతం చేయాలని అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా నిర్వహించాల్సిన ఏర్పాట్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జిల్లా ఎస్పి రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటిడిఎ పి.ఓ రాహుల్, శిక్షణా కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావుతో కలిసి శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం మరియు పట్టాభిషేకం ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాలు జిల్లా ప్రతిష్టకు భంగం కలగకుండా విఐపి లకు, పర్యాటకులకు మరియు భక్తులకు ప్రతిబింబంగా నిలిచే విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తుగా సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయ మార్గాల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రతను కచ్చితంగా పాటించాలని, భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా మార్గాలను సజావుగా ఉంచాలని తెలిపారు. భక్తులకు తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఆహార భద్రత అధికారులు హోటళ్ళు, అన్నదాన కేంద్రాలలో నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు ఉత్సవాల సమయంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఏరియా ఆసుపత్రిలో 30 పడకలను సిద్ధంగా ఉంచాలని, దర్శన లైన్ల వద్ద ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల కోసం అదనపు అంబులెన్స్ వాహనాలు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన రక్త నిల్వలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు అవసరమైన జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, ఫైర్ శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఫైర్ ఇంజిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఐటీసీ సంస్థ చేపడుతున్న బ్రిడ్జ్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమయం తక్కువగా ఉన్నందున పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ఉత్సవాల నాటికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి రోహిత్ రాజు మాట్లాడుతూ భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తలంబ్రాలు తీసుకునే సమయంలో భక్తుల రద్దీని నియంత్రించాలని, సెక్టార్ వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. ఆలయ సిబ్బంది వివరాలను ముందుగానే నమోదు చేసి భద్రతా పరంగా వినియోగించాలని అన్నారు .పంచాయతీ అధికారులు అనుమతులు లేని ఫ్లెక్సీలు తొలగించి ఆధ్యాత్మిక వాతావరణానికి అనుగుణంగా మాత్రమే ప్రచార సామగ్రి ఉండేలా చర్యలు తీసుకోవాలని, పంచాయతీ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలు దృష్ట్యా మద్యం దుకాణాలను మూసివేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే వారికి డ్రెస్ కోడ్ అమలు చేయాలని, వైద్య శాఖ అదనపు వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ద్వారా శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎస్పి తెలిపారు . అనంతరం మిథిలాస్ స్టేడియంలో శ్రీరామనవమి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను మరియు మాడవీధులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికి చర్యలు: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్





మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యలను తప్పకుండా పరిశీలించి, వాటికి పరిష్కారం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హామీ ఇచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో పరిష్కరించగలిగే అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి, ప్రత్యేక చొరవతో పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో సమావేశమై ఆశా వర్కర్ల సమస్యలను చర్చించి, అమల్లో ఉన్న నియమ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తాను కట్టుబడి ఉంటానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో ఆశా వర్కర్లు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్యలు, డిమాండ్లను వివరించిన వినతిపత్రాన్ని ఆయనకు సమర్పించారు.

# సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ.



సింగరేణి మార్చి 17 నిర్భయవార్త రిపోర్టర్. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కారేపల్లి మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈసందర్భంగా కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిందన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వ తప్పిదాలను సాకుగా చూపి వాగ్దానాలను అమలు చేయకుండా తప్పించుకోవాలని చూడడం సరికాదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సంక్షేమ పథకాల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2500, వఅద్ధాప్య వితంతు పెన్షన్ రూ.4వేలు వికలాంగులకు రూ. 6వేలు, కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ రూ.లక్ష తో పాటు తులం బంగారం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ రూ.500, వ్యవసాయ కూలీలకు ఏడాదికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద రూ.12వేలు, రైతులకు రుణమాఫీ తో పాటు పెండింగులో ఉన్న రైతు భరోసా విడుదల చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు, విద్యా, వైద్య రంగాన్ని మెరుగుపరచటం ద్వారా ప్రజల అభిమానాన్ని చూరగోనాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలక భూమిక పోషిస్తున్న స్కీమ్ వర్కర్ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటే బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిజాయితీకి కట్టుబడాలన్నారు. హామీలు వేగవేతకు ప్రయత్నిస్తే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కమిటీ మండల నాయకుల ముండ్ల ఏకాంబరం, కొండబోయిన ఉమావతి, తలారి దేవ ప్రకాష్, అన్నారపు కఅష్ణ, పాసిని నాగేశ్వరరావు, కరకపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రానగర్ బస్తీలో పాదయాత్ర

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: బండి రమేష్



కూకట్‌పల్లి, నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ తెలిపారు. మంగళవారం ఇంద్రానగర్ బస్తీలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ముఖ్యమంత్రి కూకట్‌పల్లి పర్యటన సమయంలో స్థానికులు ప్రస్తావించిన సమస్యలపై చర్యలు తీసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నివాసితులు డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి వంటి మౌలిక అంశాలను వివరించారు. కొత్తగా విద్యుత్ మీటర్లు మంజూరు కావడం లేదని కూడా ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ పైప్‌లైన్‌కు అనుమతులు లభించినప్పటికీ పనులు నిలిచిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన నాయకుడు, అవసరమైన అనుమతులు ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఆలస్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఐడిపిఎల్‌కు చెందిన భూములను కొందరు ఆక్రమించి విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం విచారణ ప్రారంభించిందని, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆక్రమిత స్థలాలను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురానున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధు గౌడ్, సోను, పులి శివ గౌడ్, మధు, నరేందర్, తిరుపతయ్య, సత్యం, శంకర్ గౌడ్, ఏ రాజు, బి రాజు తదితరులు పాల్గొన్నారు.



# కోట మైసమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు పవిత్ర బ్రహ్మోత్సవాలు.



సింగరేణి మార్చి 17 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల పరిధిలోని శ్రీ కోటమైసమ్మ దేవాలయంలో ఈనెల 20నుండి మూడు రోజుల పాటు పవిత్ర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఈఓ కె.వేణుగోపాలాచార్యులు తెలిపారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వారు మాట్లాడుతూ కృష్ణ యజుర్వేద పండితులు కొడమంచిలి ఫణికుమార్ ఆధ్వర్యంలో 20వ తేదిన మంగళవాయిద్యాలు, మంగళతోరణములు, మహావిద్యపాశుపతీహోమము ఉంటుందన్నారు. 21వ తేదిన శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి వారి మహాన్యాస పూర్వర ఏకాదశ రుద్రాభిషేకము జల బిందెల అభిషేకం, సాముహిక కుంకుమ పూజ, శ్రీమహా త్రిపుర సుందరి బ్రహ్మా విద్యా మంత్రీహోమము, 22వ తేదిన మహాపుష్పార్చన, మహాపూర్ణహుతి నిర్వహించటం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల మూడు రోజులు దాతలు రావూస్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్, ఇల్లందు. శ్రీకాకతీయ స్కూల్, ఇల్లందు, సింగరేణి మర్చంట్స్ అసోసియేషన్, ఇల్లందు, జక్కుల రామకోటేశ్వరావు, సీఐ జక్కుల శంకర్ రావు, జక్కుల వెంకటగిరి కృష్ణారావులచే అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

# చారిత్రక 'కోట్ల'



గంగాధర, మార్చి 17 నిర్భయవార్త ప్రతినిది :గంగాధర మండలంలోని కోట్ల నర్సింహులపల్లెలో 2018 సంవత్సరంలో ఒగ్గు అంజయ్య అనే రైతు తన పొలంలో దుక్కిదున్నుతుండగా 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడి విగ్రహం బయటపడింది. అదే పొలంలో 2020 జూన్ 13న 24వ (చివరి) తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడి విగ్రహం బయటపడింది. ఈ విగ్రహాలను క్రీస్తుశకం 9వ శతాబ్దానికి చెందినవిగా అంచనా వేశారు. ఈ ప్రాంతాన్ని క్రీస్తుశకం 750 నుంచి 972 వరకు వేములవాడ చాళిక్యులు, రాష్ట్రకూటులు పాలించారని, వారి హయాంలో హిందూ, జైన మతాల విస్తరణ జరిగిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఇదే గ్రామంలో కాకతీయుల కాలం నాటి నందగిరి వీర భద్రస్వామి ఆలయం, గ్రామాన్ని ఆనుకొని ఉన్న దేవుని గుట్టపై ప్రసన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, సీతారామచంద్ర స్వామి ఆలయం, మరో గుట్టపై శివాలయం, కోనేరు ఉన్నాయి. మూడేళ్ల వ్యవధిలో ఒకే పొలంలో ఇద్దరు జైన తీర్థంకరుల విగ్రహాలు బయట పడడం, గ్రామంలో వివిధ దేవాలయాలు, కోట, కోనేరు ఉండడంతో ఈ ప్రాంతం పురావస్తు సంపదకు నిలయంగా ఉండవచ్చని, పురావస్తుశాఖ పరిశోధనలు జరిపితే ఎన్నో చారిత్రక ఆధారాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. విగ్రహాల తరలింపు కోసం గ్రామస్థులు అంగీకరించలేదనే కారణంతో జైన విగ్రహాల బాధ్యతను తప్పించుకున్న పురావస్తుశాఖ ఆ తర్వాత పరిశోధన చేసే విషయాన్నే మరిచిపోయింది.

**ఎకరం స్థలంలో ఆలయ నిర్మాణం**

జైన సమాజం తమ తీర్థంకరులైన వర్ధమాన మహావీరుడు, పార్శ్వనాథుల ఆలయాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చింది. విగ్రహాల తరలింపు కోసం జైన మతానికి చెందిన పెద్దలు, వివిధ రాష్ట్రాల నుంచి కోట్ల నర్సింహులపల్లెకు వచ్చి ప్రయత్నాలు చేశారు. ఆ విగ్రహాలతో అక్కడే ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు పట్టుబట్టడంతో 30 లక్షల రూపాయలు వెచ్చించి ఎకరం స్థలాన్ని కొనుగోలు చేశారు. అక్కడే నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఆ విగ్రహాలను ఒక్క చిన్న రేకుల షెడ్డులో ఉంచారు. జైన మతస్తులు, వారి గురువులు ఆగ్రామానికి వచ్చిన సందర్భంలో ఆ విగ్రహాలకు పూజలు చేస్తున్నారు. ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసి నిత్యపూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**పట్టించుకోని పురావస్తు శాఖ**

పురాతన చారిత్రక కట్టడాలు, ఆలయాలు, పురాతన వస్తువులను సంరక్షించడానికి ఏర్పాటుచేసిన సంస్థ పురావస్తుశాఖ. చారిత్రక తవ్వకాలు, శాసనాల పరిశోధన, బౌద్ధ, జైన, హిందూ, ఇస్లామిక్, వలస రాజ్యాల కాలం నాటి స్మారక చిహ్నాల పరిరక్షణ ఈ సంస్థ పరిధిలోకే వస్తుంది. కానీ ఈ సంస్థ గంగాధర మండలం కోట్లనర్సింహులపల్లెలో బయటపడ్డ జైనుల విగ్రహాల విషయంలో మాత్రం తన బాధ్యతను విస్మరించిందనే విమర్శలున్నాయి. ఈ గ్రామంలో జైన తీర్థంకరులు వర్ధమాన మహావీరుడు, పార్శ్వనాథుడి విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామస్థులు సహకరించడం లేదని వాటిని అక్కడే ఉంచి తన బాధ్యత ముగిసిందని పురావస్తు శాఖ చేతులు దులుపుకుంది. జైన సమాజం ఆ విగ్రహాలకు ఆలయ నిర్మించి జైన క్షేత్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నది. గ్రామంలోనే ఎకరం భూమిని కొనుగోలు చేసిన జైనులు వర్ధమాన మహావీరుడు, పార్శ్వనాథుల విగ్రహాలు నెలకొల్పేందుకు కోటి రూపాయల అంచనా వ్యయంతో గుడి నిర్మాణం చేపట్టారు. రాజస్థాన్ నుంచి తెచ్చిన పాలరాతితో ఈ జైన మందిరాన్ని నిర్మిస్తున్నారు. ఆలయంతోపాటు నిత్యం అక్కడికి వచ్చే భక్తులకు ఆహారం అందించేందుకు వంటశాల, భోజనశాల, జైన గురువులు వచ్చిన సందర్భంలో బస చేసేందుకు వసతి గృహాలను నిర్మిస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం



రాజన్న సిరిసిల్ల, నిర్భయవార్త ప్రతినిది : యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే విధంగా పౌరసరఫరాల శాఖ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. జిల్లాలో యాసంగిలో 1.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.81 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. వరికోతలకు సమయం అసన్నమ వుతున్న క్రమంలో పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు యాసంగిలో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతూ వరి పంటను దక్కించుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో రోజు రోజుకు నీటి మట్టాలు తగ్గిపోవడంతో చివరి దశలో వరి పంటను దక్కించుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు అందక దిగుబడిపై రైతులు అందోళన చెందుతున్నారు. మరోవైపు వడగళ్ల వర్షాలు, తెగుళ్లు పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు అందోళనలో ఉన్నారు. జిల్లాలో మార్చి చివరి వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అందుకు అనుగుణంగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

**దిగుబడి అంచనా 4.56 లక్షల మెట్రిక్ టన్నులు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజనల్‌లో 4.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. 4.49 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం, 7,539 మెట్రిక్ టన్నులు సన్న రకం ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇందులో విత్తనాలకు 55,064 మెట్రిక్ టన్నులు వినియోగిస్తే, 1,01,600 మెట్రిక్ టన్నులు మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 4వ వారం నుంచి 25 వేల మెట్రిక్ టన్నులు, ఏప్రిల్‌లో 1.75 లక్షల మెట్రిక్ టన్నులు, మేలో 1.76 లక్షల మెట్రిక్ టన్నులు, జూన్‌లో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ మార్చిలో 10 వేలు , ఏప్రిల్‌లో 1.15 లక్షలు, మేలో 1.50 లక్షలు, జూన్‌లో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

**240 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా 240 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఐకేపీ ద్వారా 159 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 73 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా ఒకటి, మెప్మా ద్వారా 7 కేంద్రాల ఏర్పాటుకు యాక్షన్‌ప్లాన్ రూపొం దించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించడానికి 3331807 గన్నీ బ్యాగులు అవసరం అవుతుండగా ప్రస్తుతం 2168193 అందు బాటులో ఉన్నాయి. ఇందులో కొత్తవి 1878070, ఇప్పటికే ఉపయోగించినవి 290123 లక్షలు అందుబాటులో ఉన్నాయి. కొనుగోళ్ల కోసం టార్పాలిన్లు, ఇన్నోవింగ్ మిషన్లు , పాడీ క్లీనర్‌లు, మ్యాయిశ్చరైజ్ మీట ర్లు, వేయింగ్ మిషన్లు, అస్క రిమూవర్స్ , వంటి పరికాలు అందుబాటులో ఉంచారు.

# ఇరాన్ మిలిటరీ చీఫ్‌ను హతమార్చిన ఇజ్రాయిల్ సైన్యం



టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ సైన్యం ఇరాన్ మిలటరీ చీఫ్‌ను హతమార్చాయి. ఇరాన్ బసిజ్ యునిట్ కమాండర్ ఘోలమ్రెజా సోలేమానీని హతమార్చినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) మంగళవారం ధృవీకరించాయి. ఇజ్రాయిల్‌లోని వార్తాపత్రిక జెరూసలెం పోస్ట్.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ యొక్క బసిజ్ పారామిలిటరీ మిలీషియా అధిపతి ఘోలమ్రేజా సోలేమానీ, అతని డిప్యూటీ సయ్యద్ కరిషీ మరణించినట్లు వెల్లడించింది. వీరిని ప్రధాన కార్యాలయంలో కాకుండా.. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడారాల ప్రాంతంలో చంపినట్లు మీడియా నివేదికలు వెల్లడించాయి. కాగా, సోలేమానీ నాయకత్వంలో బసిజ్ యునిట్ పౌర ప్రదర్శనకారులపై తీవ్రమైన హింసను, బలప్రయోగాన్ని ప్రయోగించింది. గత ఆరు సంవత్సరాలుగా బసిజ్ యూనిట్ కమాండర్‌గా పనిచేసిన ఘోలమ్రేజా సోలేమానీని ఐడిఎఫ్ లక్ష్యంగా చేసుకుని నిన్న హతమార్చినట్లు ఇజ్రాయిల్ సైన్యం ఎక్స్ పోస్టులో పేర్కొంది. అలాగే మరో మీడియా టిపిఎస్ న్యూస్ ఇజ్రాయిల్ సైన్యం ఇరాన్‌లో నిన్న రాత్రి ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీకి మాజీ ఉన్నత సహాయకుడైన అలీ లారిజానీని లక్ష్యంగా వైమానిక దాడికి పాల్పడినట్లు పేర్కొంది. అయితే అలీ మృతి చెందాడా? లేదా గాయపడ్డారనే విషయంపై స్పష్టత లేదని ఇజ్రాయిల్ రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

# గాలికుంటు వ్యాధిపై టీకాస్త్రం

## బెజ్జూరులో పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది
## నెలరోజుల పాటు పశువులకు వ్యాక్సినేషన్
## జిల్లాకు చేరిన 2. 60లక్షల దోసులు



బెజ్జూరు, మార్చి 17 నిర్భయవార్త ప్రతినిది : గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైన అంటు వ్యాధి. ఇది నల్ల, తెల్ల జాతి పశువుల్లో మాత్రమే సంక్రమిస్తుందని పశువైద్య అధికారులు అంటున్నారు. కాగా వ్యాధి నివారణకు ఈ నెల 10వ తేదీ నుంచి ఏప్రిల్ 9వరకు టీకాలు వేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు వ్యాక్సిన్లు సరఫరా చేయగా వాటిని పశువైద్యశాలల్లో నిల్వ చేశారు. నెలరోజుల పాటు టీకాలు చల్లని గదిలోనే ఉంచుతున్నారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయిస్తున్నారు.

**రైతులపై ఆర్థిక భారం...**

గాలికుంటు వ్యాధితో పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు నాణ్యత తగ్గుతుంది. వైద్యఖర్చులు పెరుగుతాయి. పశువులు కూడా బలహీనపడతాయి. చూడి పశువుల్లో గర్భస్రావం జరుగుతుంది. కోలుకున్న తర్వాత కూడా పశువులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడతాయి. పశువుల ఉత్పాదక శక్తి క్రమంగా తగ్గి రైతులకు నష్టం జరుగుతుంది.

**జిల్లాలో 2,73,940పశువులు...**


కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 28 పశు వైద్యశాలలు ఉన్నాయి. జిల్లాలో ఆవులు, ఎద్దులు 2,32,402, గేదెలు 41,538 ఉన్నాయి. గేదెలు, ఆవులు, ఎద్దులు, మూడు నెలల దాటిన లేగ దూడలకు గాలికుంటు వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధి అఫ్తోస్ వైరస్ వల్ల పశువులకు సంక్రమిస్తుందని వైద్యులు అంటున్నారు. వైరస్ సంక్రమణ తర్వాత పశువుల్లో నోరు, చిగుళ్లు, కాళ్ల గోళ్ల మధ్య పొక్కుల వల్ల తీవ్రమైన జ్వరం వస్తుంది. చొంగ కార్చడం, మేత మేయకపోవడం వంటి ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రత పెరిగితే ప్రాణ నష్టం కూడా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన పశువుల నుంచి ఆరోగ్యకరమైన పశువులకు గాలి, నీరు, మేత ద్వారా, దూడలకు వ్యాప్తి చెందుతుంది.

**ఏప్రిల్ 9 వరకు వ్యాక్సినేషన్ డ్రైవ్...**


జిల్లాలో ఏప్రిల్ 9వ తేదీ వరకు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు 2లక్షల 60వేల డోసుల టీకాలు సరఫరా చేశారు. వాటిని జిల్లాలోని పశువైద్యశాలల్లో నిల్వ చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రతిరోజు ఒక మండలంలో రెండు లేదా మూడు బృందాలు పశువులకు టీకాలు వేస్తున్నాయి. టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారితో పాటు ఆయా మండలాల పశువైద్య అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసిన తర్వాత సంబంధిత సిబ్బంది వివరాలను నిర్ణీత యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే సిబ్బందికి అవసరమైన సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు ఇవ్వకపోవడంతో వ్యక్తిగత సెల్‌ఫోన్లలోనే అప్‌లోడ్ చేస్తున్నారు. సమర్థవంతమైన సెల్‌ఫోన్లు లేకపోవడంవల్ల ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు.

# నాలుగు పశ్చిమాసియా దేశాలకు మానవతా సాయం అందిస్తాం

బీజింగ్, నిర్భయవార్త : ఇరాన్, లెబనాన్ సహా నాలుగు పశ్చిమాసియా దేశాలకు మానవతా సాయం అందించనున్నట్లు చైనా మంగళవారం ప్రకటించింది. ఇరాన్, లెబనాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయిల్ చేపడుతున్న దాడులు మూడో వారానికి చేరుకున్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఇరాన్, పశ్చిమదేశాలపై యుద్ధం "తీవ్రమైన మానవ విపత్తు"కి దారితీస్తుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పశ్చిమాసియా దేశాలైన ఇరాన్, జోర్డాన్, లెబనాన్ మరియు ఇరాక్‌లకు అత్యవసర మానవతా సాయం అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మానవతా సంక్షోభాన్ని కొంతవరకు తగ్గించవచ్చని ఆశిస్తున్నామని లీన్ మీడియాకు వెల్లడించారు. ఈ అంశంపై మరిన్ని వివరాలు ప్రకటించలేదు. శాంతిని ప్రోత్సహించేందుకు, యుద్ధాన్ని ఆపడానికి మరియు మావనతా సంక్షోభాన్ని నిరోధించడానికి చైనా అన్ని విధాల ప్రయత్నిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ యుద్ధాన్ని నిలిపివేసేందుకు మధ్యవర్తిత్వం వహించడానికి చైనా యత్నించిందని, దీనిలో భాగంగానే మధ్యప్రాచ్యానికి చైనా ప్రత్యేక రాయబారి జై జున్ ఇటీవల సౌదీ అరేబియా విదేశాంగ మంత్రితోచర్చలు జరిపారని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని కోరారని చెప్పారు. ఈ పరిస్థితి ఏర్పడి ఉండకూడదని, యుద్ధానికి వెంటనే ముగింపు పలకాలని చైనా ప్రధాన రాయబారి వాంగ్ యీ కూడా పేర్కొన్నారు.



# గజ్వేల్ ఇంచార్జ్ ఎమ్మార్వో భాస్కర్ కి వినతి పత్రం అందచేత



గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి : గజ్వేల్ పట్టణ మండల బిజెపి ఆధ్వర్యంలో గజ్వేల్ ఇంచార్జ్ ఎమ్మార్వో భాస్కర్ కి ఆరు గ్యారెంటీల అమలుపై వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్,మాట్లాడుతు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కౌలు రైతులకు ఎకరానికి 15000, వ్యవసాయ కూలీలకు 12000, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, మహిళలకు ప్రతినెల 2500, విద్యార్థులకు 5 లక్షల విద్య భరోసా, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, ఇందిరమ్మ ఇళ్లు, 4000 నెల వారి పెన్షన్లు, ఫీజు రీయింబర్స్మెంట్, రుణమాఫీ, రైతు భరోసా, వంటి హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోంది. రైతులు, విద్యార్థులు, మహిళల ఆక్రోశానికి అద్దం పడుతుంది ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి వృద్ధాప్య వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు కల్యాణ లక్ష్మి పేదలకు గృహ నిర్మాణ పథకం భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదు కాంగ్రెస్ మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలను నయవంచన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వానికి మిగిలి ఉన్న 999 రోజులూ వారి వైఫల్యాలను ఎండగడుతూ. ప్రజల పక్షాన బిజెపి అలుపెరగని పోరాటం చేస్తుంది. ఇందులో భాగంగా గజ్వేల్ కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ఆందోళన వ్యక్తం చేసి అనంతరం వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, దాతర్ పల్లి సర్పంచ్ బాసు రాజు, ఉప సర్పంచ్ బారు అరవింద్, మన్నె శేఖర్, చెప్యాల వెంకట్ రెడ్డి, నాయిని సందీప్ కుమార్,మన్నెం శశిధర్ రెడ్డి ,నాగు ముదిరాజ్, తలారి రాజు, పేర్ల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, సల్ల శ్రీనివాస్, శ్రీరామ్ కృష్ణ, కాశమైన సందీప్ కుమార్, కోల్పుల హనుమంత్, శ్రీనివాస్ చారి, సిలువేరు కుంకుమ రాణి, భక్త మాల,అన్నపూర్ణ, కాళ్ళ సాయి, ఎల్ల మధు, ఎల్ల బాబు, శ్రీనివాస్, పవణ్ కుమార్,పేర్ల శ్రీనివాస్, జోడు ప్రకాశ్,గోపాల్, దయాకర్ రెడ్డి, పిట్ల శ్రీనివాస్, వంజరి రాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

## గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం



గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి :సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99' కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భద్రగిరి మార్ట్ ని అభివృద్ధి దశలో నడపాలి..





## ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్.

## ఐ టి డి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్..

భద్రాచలం 17 మార్చ్ నిర్భయ వార్త ప్రతినిధి. గిరిజన రైతులకు, ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు, చిన్న తరహా పరిశ్రమలు నడుపుకునే గిరిజన కుటుంబాలకు ఆర్థిక చేకూర్పు చేయడానికి ప్రారంభిస్తున్న భద్రగిరి మార్ట్కు భద్రాచలం పట్టణంలోని వ్యాపారస్తులు మీ వంతు సహకారం అందించి భద్రగిరి మార్ట్ అభివృద్ధి దిశగా నడిచేలా చూడాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ వ్యాపారులకు సూచించారు. మంగళవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో భద్రాచలం పట్టణంలోని ప్రముఖ వ్యాపారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై భద్రగిరి మార్ట్ లో ఆర్గానిక్ సంబంధించిన నిత్యవసర సరుకులు మేము సేకరించిన వాటితో పాటు ప్రజలకు ప్రతిరోజు ఎక్కువ శాతం ఉపయోగపడే సరుకులకు సంబంధించిన జాబితాను అందించి భద్రగిరి మార్ట్ లో ప్రజలు సరసమైన ధరలకు అందించడానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటివరకు ఎస్ సి హెచ్ జి మహిళలు తయారు చేసే వివిధ రకాల ఆహార పదార్థాలకు సంబంధించిన నిత్యవసర సరుకులు అలాగే గిరిజన రైతులు పండించే వివిధ రకాల బియ్యం మరియు పప్పు దినుసులను పరిశీలించడం జరిగిందని, శ్రీరామనవమికి ప్రారంభిస్తున్నామని భద్రగిరి మార్ట్ దిగ్విజయంగా నడిచేలా సహకరించాలని వ్యాపారస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, పి వి టి జి అధికారి గన్యా, ఏపీవో పవర్ వేణు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, జేడీఎం హరికృష్ణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ మరియు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమంలో ఏడీ ఏ, ఏవో

## ప్రతి రైతుకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే రైతన్న మీ కోసం కార్యక్రమ వారోత్సవాలు..

ముద్దనూరు మార్చి 17 కడప ఇంచార్జ్ నిర్భయవార్త ప్రతినిధి : కడపజిల్లా ముద్దనూరు మండలంలోని కె తిమ్మాపురం మరియు బడుగువారిపల్లె గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఎడిఏ కె రామ మోహన్ రెడ్డి పాల్గొన్నట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఏ కె.రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ..రైతు ఇంటి దగ్గరకే వెళ్లి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు కుంటుంబానికి వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించే అన్ని రకాల పథకాల గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎపి యఫ్ ఆర్ రిజిస్ట్రేషన్, ఎలినినో ప్రభావం గురించి రైతులకు వివరించుట, ఉబరైజేషన్ మొదలగు విషయాల గురించి వివరించారు. తదుపరి మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. బడుగువారిపల్లె గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని యస్ సి కాలనీ లో ఉన్న రైతులతో మాట్లాడి పొలం కలిగి ఉన్న ప్రతి రైతు ఎపి యఫ్ ఆర్ పోర్టల్ లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అన్నారు. పకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ పంటలు సాగు చేసుకోవాలి అన్నారు. గ్రామంలో రైతులకు పకృతి వ్యవసాయ సిబ్బంది ద్రవ జీవామృతం తయారు చేసే విధానం గురించి డెమో రూపంలో వివరించారు. పియం డీఎస్ పద్ధతులను అనుసరిస్తూ పంటలు సాగు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు రైతన్న మీ కోసం సంబంధించిన కరపత్రాలను అందించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది కల్పన,సందీప్, పకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీదేవి,యమున, రమణయ్య, గ్రామ నాయకులుగోపాల్ రెడ్డి,సుబ్బారెడ్డి, బాజి మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

# రైతులకు నాచురల్ ఫార్మింగ్‌పై రైతు వేదికలలో శిక్షణ

## రైతుభరోసా పథకం యాసంగి 2025-25.



చింతపల్లి-నిర్భయవార్త ప్రతినిధి : 28/02/2025 నాటికి కొత్తగా పట్టాదార్ పాసుబుక్ పొందిన రైతులు వెంటనే సంబందిత క్లస్టర్ ఏఈఓ ను కలిసి రైతుభరోసా పథకానికి అప్లికేషన్ ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి తెలిపారు. ఇంతకు ముందు రైతుభరోసా పథకం అర్హత ఉన్న రైతులు బ్యాంకు అకౌంట్ నెంబర్ చేంజ్ గురించి ఏఈఓ లకు అప్లికేషన్ ఇవ్వాలని తెలిపారు. (ఏటీఎంఏ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) వారి సహకారంతో మంగళవారం చింతపల్లి రైతు వేదికలో రైతులకి న్యాచురల్ ఫార్మింగ్ మీద ట్రైనింగ్ ప్రోగ్రామ్ కండక్ట్ చేయడం జరిగింది. ఈ ట్రైనింగ్ కు కె.వి.కె కంపాసాగర్ సైంటిస్ట్ రాములమ్మ ముఖ్య అతిధిగా విచ్చేసారు. రైతులకు నాచరల్ ఫార్మింగ్ యొక్క ఆవశ్యకత, ఉపయోగించే జీవన ఎరువులు, కషాయాలు తయారుచేసే విధానం వివరించారు. ఈ కార్యక్రమం లో ఏటీఎం దేవరకొండ అపర్ణ, ఏఈఓలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మామిడ్యాల ప్రధాన రహదారిపై వెలుగులు

## ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు.. గ్రామ అభివృద్ధి ధ్యేయం

## గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య



గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి : సిద్దిపేట జిల్లా ములుగు మండల పరిధిలోని మామిడ్యాల గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య ఆధ్వర్యంలో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్ డివైడర్ల మధ్య ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. మామిడ్యాల గ్రామ అంబేద్కర్ చౌరస్తా నుండి బహిలంపూర్ గ్రామ అంబేద్కర్ చౌరస్తా వరకు ఉన్న రోడ్ డివైడర్లలో ఈ విద్యుత్ దీపాలను అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల పోచయ్య మాట్లాడుతూ. రాత్రి సమయాల్లో వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఈ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు ప్రదీప్, అనిల్, రంగయ్య, స్వామి, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైల్వే భూనిర్వాసితులకు పరిహారం అందించాలి





సింగరేణి మార్చి 17 నిర్భయవార్త ప్రతినిధి : కారేపల్లి గ్రామ రైల్వే భూ నిర్వాసితులు మంగళవారం సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలుపుతూ డోర్నకల్-భద్రాచలం రోడ్డు రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూ సేకరణ చేసిన భూములకు నష్టపరిహారం సమకూర్చాలని కోరారు. గతంలో సర్వే చేసి రేటు అత్యల్పంగా నిర్ణయించేందుకు అధికారులు చేస్తున్నారని భూములు కోల్పోయి అనేక ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైల్వే లైన్ ఏర్పాటులో ఇండ్లు కోల్పోయి రోడ్డు మీద పడే పరిస్థితి నెలకొందని తగిన న్యాయం చేసి భూ భూ నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నివాసి సర్పంచ్ టోనీ, భీమవరపు శ్రీనివాసరావు, సురేందర్ మనియార్,ముక్క వెంకటేశ్వర్లు, తొగర రమేష్, శ్రీను, ముండ్ల ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగాలం పండించిన పంట పశువుల పాలు...!



వేముల మార్చి 17 నిర్భయవార్త ప్రతినిధి : టమోటా ధర కుప్పకూలింది. 25 కిలోల టమోటా బాక్సు ధర కేవలం 50 రూపాయలు మాత్రమే. అంటే కేవలం కిలో రెండు రూపాయలు అన్న మాట. ఇలాంటి పరిస్థితులలో కూలీల ఖర్చులు రవాణా ఖర్చులు కూడా రావట్లేదు. ఈ ఉద్దేశంతో పొలంలోనే పంటని గొర్రెలకు, పశువులకు మేతగా వదిలేస్తున్న దృశ్యాలు చూపరులను కంటతడి పెట్టిస్తున్నాయి. కోటి ఆశలతో సాగుచేసిన టమోటా పంట మరోసారి రైతులను అప్పులపాలు చేసింది. పంట చేతికి వచ్చాక టమోటాకు ధరలు లేకపోవడంతో కాయలను పొలంలోనే కోయకుండానే వదిలేశారు. ఇంకొందరు రైతులు గొర్రెలు, పశువులకు మేతగా వేస్తున్న ఘటన వైస్సార్ కడప జిల్లాలోహొ,కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. వైస్సార్ కడప జిల్లా వేముల మండలం కేంద్రంలో చాలా మంది రైతులు ఎన్నో ఆశలతో టమోటా పంటను సాగు చేశారు. ఒక ఎకరాకు సుమారు రూ. 60 వేలు నుండి 80 వేలు పెట్టుబడి పెట్టారు. కాయలు కూడా ఎంతో బాగా పండాయి. దీంతో రైతులు ఈ సారి టమోటతో తమ జీవితాలు మారుతాయి. అనుకునేలోపు ఒక్కసారిగా టమోటా ధర అమాంతం పడిపోవడంతో టమోటా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి టమోటా కాయలను ఒక్కో కూలికి రూ.400 ఇచ్చి కూలీలను పెట్టి కోయిస్తే, సుమారు ఎకరాకు మూడు వందలు బాక్స్‌లు టమోటాలు వస్తాయి. వాటి ని అమ్ముకోవడానికి మార్కెట్ కు తరలించేదుకు 25 కేజీలు కలిగిన ఒక బాక్స్ కు రవాణా ఖర్చు రూ.50 అవుతుంది. తీరా మార్కెట్ కు వెళ్ళాక అక్కడ బాక్స్ వ్యాపారులు రూ.40 అడగడంతో టమోటా రైతులు లబోదిబోమంటున్నారు. పెట్టిన పెట్టుబడి రాక, తిరిగి అమ్ముకోవడానికి మరల చేతి నుంచి డబ్బులు పెట్టుకోలేక చాలా మంది రైతులు టమోటాను పొలంలోనే వదిలేస్తున్నారు. మరికొంత మంది రైతులు గొర్రెలకు మేత గా వేస్తూ, రైతులు కంటతడి పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఉల్లిని కొన్నట్టే టమోటాను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలి రైతులు కోరుతున్నారు.

# గజ్వేల్ ఇంచార్జ్ ఎమ్మార్వో భాస్కర్ కి వినతి పత్రం అందచేత



గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి :గజ్వేల్ పట్టణ మండల బిజెపి ఆధ్వర్యంలో గజ్వేల్ ఇంచార్జ్ ఎమ్మార్వో భాస్కర్ కి ఆరు గ్యారెంటీల అమలుపై వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్,మాట్లాడుతు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కౌలు రైతులకు ఎకరానికి 15000, వ్యవసాయ కూలీలకు 12000, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, మహిళలకు ప్రతినెల 2500, విద్యార్థులకు 5 లక్షల విద్య భరోసా, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, ఇందిరమ్మ ఇళు ,, 4000 నెల వారి పెన్షన్లు, ఫీజు రీయింబర్స్మెంట్, రుణమాఫీ, రైతు భరోసా, వంటి హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోంది. రైతులు, విద్యార్థులు, మహిళల ఆక్రోశానికి అద్దం పడుతుంది ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి వృద్ధాప్య వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు కల్యాణ లక్ష్మి పేదలకు గృహ నిర్మాణ పథకం భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలు కావడం లేదు కాంగ్రెస్ మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలను నయవంచన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వానికి మిగిలి ఉన్న 999 రోజులూ వారి వైఫల్యాలను ఎండగడుతూ. ప్రజల పక్షాన బిజెపి అలుపెరగని పోరాటం చేస్తుంది. ఇందులో భాగంగా గజ్వేల్ కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ఆందోళన వ్యక్తం చేసి అనంతరం వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, దాతర్ పల్లి సర్పంచ్ బాసు రాజు, ఉప సర్పంచ్ బారు అరవింద్, మన్నె శేఖర్, చెప్యాల వెంకట్ రెడ్డి, నాయిని సందీప్ కుమార్,మన్నెం శశిధర్ రెడ్డి ,నాగు ముదిరాజ్, తలారి రాజు, పేర్ల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, సల్ల శ్రీనివాస్, శ్రీరామ్ కృష్ణ, కాశమైన సందీప్ కుమార్, కోల్పుల హనుమంత్, శ్రీనివాస్ చారి, సిలువేరు కుంకుమ రాణి, భక్త మాల,అన్నపూర్ణ, కాళ్ళ సాయి, ఎల్ల మధు, ఎల్ల బాబు, శ్రీనివాస్, పవణ్ కుమార్,పేర్ల శ్రీనివాస్, జోడు ప్రకాశ్,గోపాల్, దయాకర్ రెడ్డి, పిట్ల శ్రీనివాస్, వంజరి రాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం




గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి :జగదేవపూర్ మండలం పరిధిలోని రైతు వేదిక నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గించుకొని, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులకు భూసార పరీక్ష పత్రాలను మరియు కిట్ లను పంపిణీ చేశారు. అనంతరంరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, జీవామృతం తయారీ, విత్తన శుద్ధి, మట్టి ఆరోగ్యం పరిరక్షణ వంటి అంశాలపై సవివరంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలీ రాజ్ పేట గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణను ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించేందుకు ప్రేరణ పొందారని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ ఏ డి ఏ ములుగు , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి , నిర్మల్ నగర్ సర్పంచ్ పద్మారావు , అలీ రాజుపేట సర్పంచ్ ఎల్లేష్ , జగదేవ్పూర్ మండల వ్యవసాయ అధికారి వసంతరావు , వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి.



గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి : మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎర్రవల్లిలో మైనార్టీ కాంగ్రెస్ నేత అంజద్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీ డిక్లరేషన్ హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో దశలవారీగా వివిధ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. మైనార్టీ వర్గాల్లోని పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించినట్లు తెలిపారు. మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్లో రూ 5 వేల కోట్లు కేటాయించగా, మైనారిటీ గురుకులాలు, మసీదుల మరమ్మత్తులకు నిధులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, మైనార్టీలకు సబ్ సబ్ ప్లాన్ వర్తింపు, యువత మహిళలకు సబ్సిడీ రుణాలు, విద్యా ఉద్యోగ అవకాశాల్లో పెద్దపీట తదితర వర్తింప చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ మైనార్టీల సంక్షేమంతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీలో పెద్ద ఎత్తున అవకాశం కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు నిమ్మ రంగారెడ్డి, నాయిని యాదగిరి, గుంటూకు శ్రీనివాస్, కౌన్సిలర్ నర్సింహా రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, ఉపేందర్ రెడ్డి,అశోక్ రెడ్డి, అజ్గర్, సుకేందర్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్ జహీర్, గాడిపల్లి శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులు చెల్లించి చిన్న పత్రికలను ఆదుకోండి

### ఆర్థిక మంత్రికి టీయుడబ్ల్యూజే వినతి



హైదరాబాద్ మార్చి17 నిర్భయవార్త సిటీ బ్యూరో :చిన్న, మధ్యతరగతి పత్రికలకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ కోరారు. మంగళవారం రోజు శాసన సభలోని ఛాంబర్ లో టీయుడబ్ల్యూజే ప్రతినిధి బృందం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. దాదాపు రెండేళ్లుగా చిన్న, మధ్యతరగతి పత్రికలకు బిల్లులు చెల్లించక పోవడంతో పడరాని తిప్పలు పడుతున్నారని, కనీసం కుటుంబంతో ఆనందంగా పండగ కూడా జరుపుకోలేని పరిస్థితిని అనుభవిస్తున్నారని విరాహత్ అలీ మంత్రి దృష్టికి తెచ్చారు. ఒక్క పెద్ద పత్రికకు చెల్లించే బిల్లుతో, వందలాది చిన్న, మధ్యతరగతి పత్రికలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ఆయన కోరగా, భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్యూరి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని కిరణ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజినీకాంత్ తదితరులు ఉన్నారు.



# బీసీలంటే మంత్రి కోమటిరెడ్డి కి చిన్న చూపు

### బీసీలు టిపిసిసిగా ఉంటే పార్టీ పంచుకోదా ??..

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



మిర్యాలగూడ నిర్భయవార్త ప్రతినిధి :రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీసీల పట్ల తనకున్న మనస్తత్వాన్ని తేట తెల్లం చేశారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ జగ్గారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు అయితే వంద సీట్లు గెలుస్తామని,కాంగ్రెస్ పార్టీ బలంగా పుంజుకుంటుందని మాట్లాడటం ఆయనకున్న కులపిచ్చి బీసీలు అంటే చిన్న చూపేనని అన్నారు. ఆయన మాటలు బీసీ పిసీసీ అధ్యక్షుడునీ అవమానించ డమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ వ్యక్తి పీసీసీ అధ్యక్షుడు అయితే ఓర్వలేక పోతున్నారని ఈరోజు బీసీ బిడ్డ టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలోనే రెండు ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారని సర్పంచి మరియు మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా గెలిపించి మహేష్ కుమార్ గౌడ్ తన సత్తా చాటారని ఈ విషయం కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి తెలియదా అని ప్రశ్నిస్తున్న. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి బీసీలు అంటే మొదటి నుంచి చిన్న చూపేనని అన్నారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బీసీ అయితే కూడా ఓర్వలేకే అతనిని చాలా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. వెంటనే కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అతని వ్యాఖ్యలు వెనుక తీసుకోవాలని లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురిగాక తప్పదని లింగం గౌడ్ హెచ్చరించారు.



# రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు అండగా ఉంటాం: జిల్లా కలెక్టర్ హైమావతి



గజ్వేల్ నిర్భయవార్త ప్రతినిధి :రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని, భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి తెలిపారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయం లోని మీటింగ్ హాల్ లో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న జగదేవ్ పూర్ మండలం చెబర్తి, అల్రాజీపేట, పిర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిటరేషన్ ప్రక్రియ గూర్చి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామం. మీప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు.









# అందాల బాంధవి !

## గ్లామర్ షోకి సైఅంటున్న చిన్నది

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొన్నేళ్ల క్రితం వచ్చిన 'మసూద' చిత్రం హారర్ ప్రియులను ఎంతగా భయపెట్టిందో మనందరికీ తెలిసిందే. ఆ సినిమాలో ఆత్మ ఆవహించిన 'నాజియా' పాత్రలో నటించి, తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను వణికించిన బాంధవి శ్రీధర్ గుర్తుంది కదా? చైల్డ్ ఆర్టిస్ట్‌గా 'మిస్టర్ పర్ఫెక్ట్', 'రామయ్యా వస్తావయ్యా' వంటి సినిమాలతో కెరీర్ మొదలు పెట్టిన ఈ హైదరాబాద్ అమ్మాయి, 'మసూద'తో ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు చూస్తుంటే, ఆ సినిమాలో భయపెట్టిన అమ్మాయేనా ఈమె అని అందరూ ఆశ్చర్యపోతున్నారు. అదిరే డ్రెస్సులో అదిరిపోయే పోజులిస్తూ, హీరోయిన్ మెటీరియల్‌లా మెరిసిపోతోంది బాంధవి. ప్రస్తుతం బాంధవి శ్రీధర్ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ తన ఫిట్‌నెస్, గ్లామర్ ఫోటోలతో ఫాలోయింగ్‌ను పెంచుకుంటోంది. జిమ్ సెల్ఫీలతో పాటు లేటెస్ట్ ఫోటో షూట్‌లతో కుర్రకారును మాయ చేస్తోంది. 2024లో 'లైట్ హౌస్', అలాగే ఈ ఏడాది (2025)లో విడుదలైన 'జాట్' సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించి తనలోని యాక్షన్ కోణాన్ని కూడా చూపించింది. ప్రస్తుతం గ్లామర్ హీరోయిన్‌గా వెండితెరపై మెరవడానికి సిద్ధమవుతోంది.

# ఆస్కార్ వేదికపై ప్రియాంకా హొయలు

## వైటు గౌనులో మెరిసిన భామ

ప్రపంచ సినీ యవనికపై అత్యంత వైభవంగా జరిగిన 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) వేడుకలో భారత్ గర్వించదగ్గ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తనదైన ముద్ర వేశారు. హాలీవుడ్ ప్రముఖులతో నిండిన ఈ సభలో ఆమె మరోసారి ప్రెజెంటర్‌గా మెరిసి, అంతర్జాతీయ వేదికలపై తనకున్న తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకున్నారు. వైట్ గౌనులో వింటేజ్ లుక్ ఆస్కార్ వేడుక కోసం ప్రియాంక చోప్రా ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'డియోర్స రూపొందించిన స్ట్రాప్‌లెస్ వైట్ గౌనును ధరించారు. హాలీవుడ్ గోల్డెన్ ఎరా నాటి క్లాసిక్ లుక్‌ను గుర్తుకు తెచ్చేలా ఈ డ్రెస్ ఉంది. హై-స్లిట్, ఫెదర్ డీటెయిలింగ్‌తో ఉన్న ఈ గౌనుకు తోడుగా ప్రియాంక తన మెడలో భారీ డైమండ్ నెక్లెస్ ధరించారు. ప్రియాంక చోప్రా ధరించిన దుస్తులు మరియు ఆమె ప్రదర్శించిన హుందాతనం ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గతంలో కూడా పలుమార్లు ఆస్కార్ వేదికపై మెరిసిన ఆమె, ఈసారి అంతర్జాతీయ చిత్ర విభాగానికి అవార్డు అందించడం ద్వారా గ్లోబల్ సినిమాపై తనకున్న పట్టును మరోసారి నిరూపించుకున్నారు.

# చూపుల్తోనే.. మాయచేస్తోంది

## సరికొత్త లుక్స్‌లో ఇస్మార్ట్ భామ



సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసు కుంది హీరోయిన్ నభా నటేష్. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా నటిం చిన ఇస్మార్ట్ శంకర్ మంచి హిట్ అందించింది. ఈ సినిమాతో ఇస్మార్ట్ బ్యూటీగా పేరు దక్కించుకుంది. 2022 తర్వాత మళ్లీ ఇండస్ట్రీలో కనిపించలేదు.. కారణం యాక్సిడెంట్.. ఈ యాక్సిడెంట్ తర్వాత కోలుకున్న ఈమె ఇప్పుడు మళ్లీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఏకంగా రెండు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా మారింది. స్వయంభు, నాగబం ధం చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. త్వరలో స్వయంభూ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో మరొకవైపు తన గ్లామర్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.. వైట్ అండ్ పింక్ కాంబినేషన్‌లో ఉన్న శారీ ధరించి తన అందా లతో మెస్మరైజ్ చేసింది. కొంటెగా కవ్విస్తూ తన చూపులతో మాయ చేసింది. విభిన్నమైన ఫోజులతో ఫోటోలను షేర్ చేసిన నభా నటేష్ అందానికి అభిమానులు ముగ్ధులవుతున్నారు. ఈమధ్య కాలంలో తన సినిమా ప్రమో షన్స్‌లో భాగంగానే ఇలా రోజుకొక గ్లామర్ ఫోటో షేర్ చేస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకవైపు ఇలా గ్లామర్ ఫోటో లు.. మరొకవైపు సినిమా ప్రమోషన్స్ లో భా గంగా సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ వదులు తూ మరింత పాపులారిటీ అందుకుంది.




# సూర్యతో మమిత

## అతడికి 40.. ఆమెకు 20

- సరికొత్త ప్రేమ కథా చిత్రం
- ఆకట్టుకుంటున్న "విశ్వనాథ్ & సన్స్" టీజర్


హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం "విశ్వనాథ్ & సన్స్" పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అది సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది. టీజర్‌ను పరిశీలిస్తే ఇది సాధారణ కమర్షియల్ సినిమా కాకుండా భావోద్వేగాలతో నిండిన స్పోర్ట్స్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. ముఖ్యంగా ఓ షూటర్ స్పోర్ట్స్ పర్సన్ జీవితాన్ని, అతని కష్టాలు, విజయాలు, వ్యక్తిగత జీవితం చుట్టూ కథ నడుస్తున్నట్టు టీజర్‌లో చూపించారు.

ఇందులో హీరో పాత్రకు గాఢమైన భావోద్వేగాలు, జీవితంలో ఎదురైన పోరాటాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్యకు జంటగా యువ నటి మమిత బైజు నటిస్తోంది. టీజర్‌లో వీరి మధ్య ఉండే ప్రేమకథ కూడా కథలో కీలక పాత్ర పోషించనున్నంది. ముఖ్యంగా హీరో 40 ఏళ్ల వయసులో ఎదుర్కొనే ప్రేమకథను దర్శకుడు చాలా హృద్యంగా చూపించబోతున్నట్టు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ అంశం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. టీజర్‌లో విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. షూటింగ్ రేంజ్‌లో జరిగే సన్నివేశాలు, స్పోర్ట్స్ నేపథ్యంతో రూపొందించిన సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. మేకర్స్ ఇప్పటికే ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

# దీవానా.. దిల్ ఖుష్!

- సమ్మర్‌లో ప్రేమ కథా చిత్రం
- టీజర్‌తోనే ఆకట్టుకుంటున్న కొత్త మూవీ

యంగ్ హీరో హర్షిత్ రెడ్డి లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ దీవాన ఇప్పుడు టాలీవుడ్ లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల విడుదలైన ఆ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ప్రేమ కథా చిత్రాల్ని ఇష్టపడే యూత్ ను ముఖ్యంగా టార్గెట్ చేసిన ఆ టీజర్ ఫుల్ గా ట్రెండ్ అవుతోంది. సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. విజువల్స్, మ్యూజిక్, లవ్ ఎమోషన్స్ అన్నీ సూపర్ అని సినీ ప్రియులు కామెంట్స్ పెడుతున్నారు. టీజర్ ద్వారా దీవాన మూవీ ఇంటెన్స్ లవ్ స్టోరీగా రూపొందుతోందని క్లియర్ గా తెలుస్తోంది.ప్రేమలో ఉండే ఎమోషన్స్, యూత్ జీవితాల్లో చోటు చేసుకునే సంఘటనలను కల్ట్ లవ్ స్టోరీ తరహాలో దర్శకుడు చూపించబోతున్నారని టీజర్ చెప్పకనే చెబుతోంది. ముఖ్యంగా టీజర్ లో కనిపించిన కొన్ని సన్నివేశాలు ఇటీవల యువతను ఆకట్టుకున్న ప్రేమకథా చిత్రాల తరహా వైబ్ ను గుర్తు చేస్తున్నాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. దీవాన చిత్రంలో హర్షిత్ రెడ్డికి జోడీగా స్నేహ మణిమేగలై యాక్ట్ చేస్తుండగా.. టీజర్ లో ఆ జంట స్క్రీన్ పై చాలా ఫ్రెష్ గా కనిపించడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ న్యాచురల్ గా కనిపిస్తుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. టీజర్ లో కనిపించిన బ్యూటిఫుల్ విజువల్స్ ప్రత్యేకంగా నిలిచాయి. లవ్ ఎమోషన్ క్లియర్ గా తెలిసేలా తీసిన షాట్స్ మెప్పిస్తున్నాయి. టీజర్ లో వినిపించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కూడా మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ముఖ్యంగా వినిపించిన "ప్రేమ ఇది ప్రేమ" అనే పాట ఇన్స్టంట్ గా కనెక్ట్ అయినట్లు కనిపిస్తోంది.




Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197